## 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' అద్భుత పథకం

శాంతాబయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): సీఎం బ్రేక్‌ఫాస్ట్ అద్భుత పథకమని ప్రముఖ శాంతా బయోటెక్ అధినేత కేఐ వరప్రసాద్‌రెడ్డి ప్రశంసించారు. శుక్రవారం ఉదయం పత్రికల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీం తాలూకు న్యూస్ చూడగానే తనకు సంతోషం వేసిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. 'మంచి చదువులు చదవాలి. మంచి ఉద్యోగాలు సంపాదించాలి అన్న ఆలోచనే తప్ప..మంచి పౌష్టికాహారాన్ని అందిద్దామన్న ఆలోచన నేటి కుటుంబాల్లో ఉండటం లేదు. హడావిడిగా టిఫిన్‌బాక్స్ పెట్టేసి.. స్కూల్ బస్సు ఎక్కిస్తే మా పనైపోయింది అన్నట్టుగా తల్లులు ఆలోచిస్తున్నారు. నేటిరోజుల్లో ఆరోగ్యం కన్నా.. డబ్బే ప్రధానమయ్యింది. సూర్యోదయం నుంచి మధ్యాహ్నంలోపు జఠరాగ్ని తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ సమయంలో మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. కానీ తల్లిదండ్రుల్లో అత్యధికులు ఉదయాన్నే పిల్లకు కాఫీ/టీతో సరిపుచ్చి స్కూల్‌కు పంపిస్తున్నారు. వాళ్లు ఉదయమంతా కడుపు మాడ్చుకుని, మధ్యాహ్నం టిఫిన్‌బాక్స్ తెరుస్తారు. ప్రతి ఇంట్లో జరిగే తంతు ఇదే. మంచి పౌష్టికాహారం అందితేనే మంచి చదువులు, మంచి ఆరోగ్యాన్ని పొందగలం. సీఎం బ్రేక్‌ఫాస్ట్ చాలా మంచి కార్యక్రమం. ఇలాంటి పథకాన్ని అమలుచేస్తున్నందుకు సెల్యూట్. ఈ పథకంతో లబ్ధిపొందిన ప్రతి తల్లి దీవిస్తుంది' అని కేఐ వరప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.

### రుచికరమైన పోషకాహారం



సీఎం బ్రేక్‌ఫాస్ట్ మెనూ చాలా బాగుంది. ప్రభుత్వమే పూర్తి ఖర్చును భరించి ఉచితంగా బ్రేక్‌ఫాస్ట్‌ను సమకూర్చడం గొప్ప విషయం. మన ఊరు-మన బడిలో భాగంగా రాష్ట్రంలో 4,700కు పైగా ఉన్నత పాఠశాలల్లో నిర్మించిన డైనింగ్ హాళ్లల్లోనే విద్యార్థులు కూర్చొని తినబోతుండటం ఆనందదాయకం.

–ఆర్ శ్రీధర్‌రెడ్డి,టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్

### విద్యాచరిత్రలో పొద్దుపొడుపు



సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం పాఠశాల విద్యా చరిత్రలో నూతన పొద్దుపొడుపు. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ వర్గాల కుటుంబాల పిల్లలకు ఈ పథకం గొప్ప వరం. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందజేస్తున్న సీఎం కేసీఆర్ అల్పాహార పథకంతో రాష్ట్రం నుదుటిన బంగారు బీజాక్షరాలు దిద్దారు.

–ఆంజనేయగౌడ్, సాట్స్ చైర్మన్

# పోషకాహారలోపం నిర్మూలనే లక్ష్యం

- హైస్కూల్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- మెనూ ప్రకారం పెట్టకపోతే నాకు ఫోన్ చేయండి
- హైదరాబాద్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): బంగారు తెలంగాణలో పోషకాహార లోపం ఆనవాళ్లను నిర్మూలించడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమని మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం తెలంగాణ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని' శుక్రవారం హైదరాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని మునగ రామ్మోహన్ రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేటీఆర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా పథకాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్ రుచికరంగా ఉందని, మెనూ బాగుందని కితాబిచ్చారు. మెనూ ప్రకారం అల్పాహారం అందివ్వకపోతే తనకు ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యతతో కూడిన అల్పాహారాన్ని అందివ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు.




హైదరాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని మునగ రామ్మోహన్‌రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న మంత్రి కేటీఆర్

#### బ్రేక్‌ఫాస్ట్‌పై ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి

మరో ఐదారు రోజుల్లో దసరాలు సెలవులు వస్తున్నాయని, ఈ లోపు అల్పాహార పథకం ఎలా ఉన్నదనే ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని టీచర్లకు మంత్రి కేటీఆర్ సూచించారు. ఈ పథకాన్ని ఎలా అభివృద్ధి చేయాలో సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ పథకం అమలుతో తల్లిదండ్రులకు, విద్యార్థులకు లాభం కలుగుతుందని తెలిపారు. తమిళనాడులో 1 నుంచి 5వ తరగతుల వరకు బ్రేక్‌ఫాస్ట్ పెడుతున్నారని, తెలంగాణలో సీఎం కేసీఆర్ 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖ అధికారి రోహిణి, జోనల్ కమిషనర్ రవికిరణ్, అడిషనల్ కమిషనర్ స్నేహశబరిశ్, ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




### ఆదిలాబాద్‌లో రెండు కొత్త మండలాలు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వం రెండు కొత్త మండలాలను ఏర్పాటుచేసింది. సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ రూరల్ నుంచి రెండు గ్రామాలు, జైనథ్, భేల మండలాల నుంచి ఐదు చొప్పున గ్రామాలు.. మొత్తంగా 12 గ్రామాలతో సాత్నాల మండలాన్ని ఏర్పాటుచేసింది. జైనథ్ మండలం నుంచి 28 గ్రామాలను వేరుచేస్తూ భోరజ్ మండలాన్ని ఏర్పాటుచేసింది.

### 27 వరకు డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లోని మొదటి సంవత్సర విద్యార్థులు ఈ నెల 27లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. రూ. 50 ఆలస్య రుసుముతో నవంబర్ 3 వరకు అవకాశం ఉన్నదని చెప్పారు. వివరాలకు www.bse.telangana.gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# వేర్వేరు టిఫిన్లు.. తీరొక్క రుచులు

- సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు శ్రీకారం
- రుచులు ఆస్వాదించిన విద్యార్థులు
- లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): వేడి వేడి ఇడ్లీ సాంబార్.. పూరీ ఆలుకుర్మా.. ఉగ్గాని పల్లిచట్నీ.. రాగిఇడ్లీ పల్లీ చట్నీ.. రవ్వకేసరి. ఇలా తీరు తీరు టిఫిన్లు.. తీరొక్క రుచులను విద్యార్థులు ఆస్వాదించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి డైనింగ్ టేబుళ్ల మీద కూర్చొని పల్లెంలో వడ్డించిన అల్పాహారాన్ని రుచి చూశారు. రోజూ ఆలస్యంగా వచ్చే విద్యార్థులు పరుగుపరుగున బడులకు చేరారు. ఉదయాన్నే ఉత్సాహంగా బడికి పరుగెత్తుకొచ్చి ఆకలి తీర్చుకున్నారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల ఆకలితీర్చే 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం' రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సికింద్రాబాద్ మారేడుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పథకం ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులందరూ విద్యార్థులతో కలిసి టిఫిన్లు ఆరగించారు. మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి చిన్నారులకు ఇడ్లీలు తినిపించారు. అల్పాహారం రుచి ఎలా ఉందని అడిగి తెలుసుకొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో అక్షయపాత్ర, మన్నా ట్రస్ట్‌ల ద్వారా బ్రేక్‌ఫాస్ట్‌ను వడ్డించగా, మిగతా జిల్లాల్లో మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు అల్పాహారాన్ని సిద్ధం చేశారు. దసరా నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బడుల్లోని విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేయనున్నారు.

#### కడుపునిండా తిండి.. బుర్ర నిండా చదువులు

చిన్నారులు బడికొస్తే చాలు.. రెండు పూటలా ఆహారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. కడుపునిండా తిండి.. బుర్ర నిండా చదువులను అందిస్తున్నది. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్, తాగేందుకు శుద్ధమైన మిషన్ భగీరథ నీళ్లు. ఒంటి గంటకు మధ్యాహ్న భోజనం.. అదీ సన్నబియ్యంతో వండినది.. ఆకుకూరలు, రోజూ పప్పు, కూరగాయలు.. వారంలో మూడు రోజులు ప్రొటీన్ల సమ్మేళనమైన కోడిగుడ్డు లేదా శక్తినిచ్చే అరటిపండ్లు, రాగిజావాను సమకూరుస్తున్నది. పేదలు, కష్టజీవుల పిల్లల ఆకలితీర్చేందుకు మానవీయకోణంలో పథకాలను అమలు చేస్తున్నది. ప్రభుత్వమే తల్లి, తండ్రి అయ్యి 23 లక్షల మంది చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నది. ఉదయాన్నే బడికి వస్తే చాలు సాయంత్రం ఇంటికెళ్లే వరకు విద్యార్థుల కడుపు నింపుతున్నది. చదువులపరంగా తొలిమెట్టు, లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్, లక్ష్య వంటి కార్యక్రమాలతో విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషిచేస్తున్నది. నాష్తా, బువ్వపెట్టి చక్కని చదువులు చెప్పి నిరుపేద బిడ్డల బంగారు భవిష్యత్తుకు తెలంగాణ సర్కారు చుక్కానిలా నిలుస్తున్నది.

#### ఏం తినక చెక్కరొచ్చి కిందపడిపోయిన

"నాకు నాన్న లేడు. కుటుంబ పోషణ కోసం అమ్మ ఓ కంపెనీలో పనిచేస్తుంది. తమ్ముడు, నేను చదువుకుంటున్నాం. పనికెళ్లే హడావిడిలో అమ్మ ఏదో ఒకటి చేసిపెడుతుంది. ఒక్కోసారి ఏం లేకపోవడంతో వారంలో రెండు రోజులు ఏం తినకుండానే బడికొచ్చేదానిని. గతంలో ఓసారి ప్రార్థన సమయంలోనే కండ్లు తిరిగి పడిపోయా. అప్పుడప్పుడు చక్కరొచ్చినట్లు అయ్యేది. చదువు మీద శ్రద్ధపెట్టేదాన్ని కాదు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంలో స్కూల్‌లోనే టిఫిన్ పెడుతుండటంతో మా చింతలన్నీ దూరమయ్యాయి. స్కూల్‌లో పెట్టిన టిఫిన్లు రుచికరంగా ఉన్నాయి.

– అక్షిత, పదో తరగతి (రావిర్యాల జడ్పీహెచ్‌ఎస్)

#### అమ్మకు కష్టం తప్పింది

మా అమ్మానాన్న ఆర్‌సీఐ కంపెనీలో పనిచేస్తారు. ఉదయం 7:30 గంటలకే డ్యూటీకి వెళ్తారు. మా అమ్మ ఉదయం 5 గంటలకే లేచి టిఫిన్లు సిద్ధం చేస్తుంది. దోస, ఇడ్లీ, ఉప్మా ఇలా రోజుకో వెరైటీ చేసిపెడ్తుంది. మేం ఇంట్లో తినే టిఫిన్లనే స్కూల్‌లో పెడుతున్నారు. దీంతో అమ్మకు కష్టం తప్పింది. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, అరటిపండ్లు, రాగిజావ ఇస్తున్నారు. ఇప్పుడు బ్రేక్‌ఫాస్ట్ కూడా పెడుతుండటం ఆనందంగా ఉన్నది.

దీక్షిత, 8వ తరగతి (రావిర్యాల జడ్పీహెచ్‌ఎస్)

#### 'అల్పాహారం' దేశానికే ఆదర్శం

సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం దేశానికే ఆదర్శమైన పథకం. సీఎం కేసీఆర్ చొరవకు ధన్యవాదాలు. పేద విద్యార్థులు అర్ధాకలితో పాఠశాలకు రావొద్దన్న ఉద్దేశంతో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టడం శుభసూచకం. ఈ పథకంతో పౌష్టికాహారం అందడమే కాకుండా, విద్యార్థుల డ్రాపౌట్ రేట్ తగ్గుతుంది.

– ఎం చెన్నయ్య, టీచర్ (హిమాయత్‌సాగర్ స్కూల్)

# చదువులిక ఫాస్ట్

మొదటిపేజీ తరువాయి...

సమూల మార్పులు తెచ్చే పథకంగా అభివర్ణించారు. 'చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీలుగా పనిచేస్తుంటారు. డ్యూటీలకు వెళ్తుంటారు. ఆయా కుటుంబాలకు చెందిన పిల్లలు తినకుండా స్కూళ్లకు వస్తున్నారు. ఆకలైతే చదువు బుర్రకెక్కే అవకాశముండదు. ముందు కడుపునిండితేనే బుర్రకెక్కుతుంది. అందుకు విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని ఈ పథకానికి శ్రీకారం చుట్టాం' అని వివరించారు. ఇంగ్లిష్ మీడియం చదువులను అందుబాటులోకి తెచ్చామని, వెయ్యికి పైగా గురుకులాలున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. ఆడ పిల్లల కోసం సగానికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశామని, 70కి పైగా మహిళా డిగ్రీ కాలేజీలను నెలకొల్పామని తెలిపారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం దసరా తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుందని వెల్లడించారు.

#### మానవీయ సీఎం.. మానవీయ ప్రభుత్వం..

కేసీఆర్ మానవీయ సీఎం అని, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం మానవీయ ప్రభుత్వమని, మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. సీఎం కేసీఆర్ అమలుచేసే ప్రతి పథకంలో మానవీయ కోణం ఉంటుందని వెల్లడించారు. బాల్య వివాహాలను పూర్తిగా రూపుమాపేందుకు కల్యాణలక్ష్మి, ప్రభుత్వ దవాఖానల్లో వందశాతం సహజ ప్రసవాలు, మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కేసీఆర్ కిట్, మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులను తగ్గించి ప్రజల ఆరోగ్య ప్రమాణాల పెంపునకు మిషన్ భగీరథ, విద్యాప్రమాణాల పెంపు కోసం ఇంగ్లిష్ మీడియం చదువులు.. తాజాగా డ్రాపౌట్ రేట్‌ను తగ్గించడం, ఆడపిల్లల్లో రక్తహీనతను తగ్గించేందుకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల మీద భారం, ఒత్తిడి తగ్గుతాయని తెలిపారు.

#### పౌష్టికాహారంతో కూడిన మెనూ: సబితా ఇంద్రారెడ్డి

పేద విద్యార్థుల కడుపునింపేందుకు ప్రవేశపెట్టిందే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకమని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇంత గొప్ప పథకం ప్రవేశపెట్టినందుకు రాష్ట్రంలోని చిన్నారులంతా మనస్ఫూర్తిగా సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పౌష్టికాహారంతో కూడిన మెనూను రూపొందించామని తెలిపారు. పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, మున్సిపల్‌శాఖల సమన్వయంతో పథకాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు. 'నేను స్కూళ్లను సందర్శించిన క్రమంలో బడికొచ్చేటప్పుడు బ్రేక్‌ఫాస్ట్ తిని వస్తారా? అని ఓ 10 మంది విద్యార్థులను అడిగితే 8 మంది కేవలం టీ తాగి వస్తామని చెప్పారు. స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేసేవరకు అలాగే ఉంటామని అన్నారు. అది నన్ను చాలా కలిచివేసింది' అని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్‌ను అమలుచేయాలన్న సీఎం కేసీఆర్ ఆలోచన ఎంత గొప్పగా ఉందో పిల్లలతో మాట్లాడిన తర్వాతే తనకు అర్థమైందని అన్నారు. దేశంలోనే విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. 'మన ఊరు మన బడి' కార్యక్రమంతో అన్ని హంగులతో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా రూ.7 వేల కోట్లు ఖర్చుపెట్టి బడుల రూపురేఖలు మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 9, 10వ తరగతులకు భోజనం పెడుతున్నట్టు వివరించారు. ఎంపీలు గడ్డం రంజిత్‌రెడ్డి, బీబీపాటిల్, ఎమ్మెల్సీలు శంబీర్‌పూర్ రాజు, రఘోత్తంరెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్, విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

### కష్టాలకు చలించి.. డబుల్ బెడ్రూం ఇచ్చి..

మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎదుట 7వ తరగతి విద్యార్థి విష్ణు జగదీశ్ తన గూడు గోడు వెళ్లబోసుకున్నాడు. అద్దె ఇంట్లోని ఇరుకు గదిలో చదువుకోలేకపోతున్నానని ఆవేదన చెందాడు. బాలుడి కష్టాలు చూసి చలించిన సబితా ఇంద్రారెడ్డి వెంటనే విష్ణు కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేశారు. 'నువ్వు కోరుకుంటున్నట్టే ఇల్లు మంజూరు చేస్తున్నా. నువ్వు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి' అని ఆ బాలుడిని ఆశీర్వదించారు.

–మహేశ్వరం



### చేనేత, హస్తకళ మేళా షురూ

300 స్టాళ్లలో 19 రాష్ట్రాల ఉత్పత్తులు

ఈ నెల 16 వరకు అందుబాటులో

హైదరాబాద్, అక్టోబరు 6 (నమస్తే తెలంగాణ): స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తుల మేళా 'సరస్'ను సెర్ప్ సీఈవో గౌతం పొట్రుతో కలిసి సీడీఎంఏ పమేలా సత్పతి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. నెక్లెస్ రోడ్‌లోని ప్రసాద్ ఐమాక్స్ పక్కన హెచ్‌ఎండీఏ మైదానంలో ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈ నెల 16 వరకు ఉంటుంది. 19 రాష్ట్రాల్లోని మహిళలు తయారుచేసిన చేనేత, హస్తకళాకృతులు 300 స్టాళ్లలో అందుబాటులో ఉంచారు. రోజూ సాయంత్రం తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తారు. ప్రవేశం ఉచితం. చేనేత, హస్తకళలు, వివిధ రకాల పిండివంటలు ప్రదర్శనకు ఉంచారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.8°c | 20.1°c |
| నల్లగొండ | 37.7°c | 24.0°c |
| రంగారెడ్డి | 35.3°c | 17.7°c |
| ఖమ్మం | 35.0°c | 21.0°c |
| మెదక్ | 35.0°c | 17.8°c |
| వరంగల్ | 34.0°c | 23.0°c |
| నిజామాబాద్ | 33.9 °c | 22.3°c |
| కరీంనగర్ | 33.0°c | 23.0°c |
| హైదరాబాద్ | 32.9°c | 20.2°c |
| మహబూబ్‌నగర్ | 31.0°c | 22.6°c |

# ఎన్నికల నిర్వహణకు 2 లక్షల మంది

- అవసరమైన వారికంటే అధికంగా అందుబాటులో
- అత్యవసర శాఖల సిబ్బందికి మినహాయింపు
- సీఈసీకి సమాచారమిచ్చిన రాష్ట్ర ఎన్నికల అధికారులు

హైదరాబాద్, అక్టోబరు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు కనీసం రెండు లక్షల మంది అధికారులు, సిబ్బంది అవసరమవుతారని ఎన్నికల సంఘం అంచనా వేసింది. ఆ మేరకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్టు గుర్తించింది. 119 నియోజకవర్గాల పరిధిలోని 35వేల పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ రోజున పెద్ద ఎత్తున సిబ్బంది అవసరమవుతారు. నామినేషన్లు, ప్రచారం, వ్యయ పరిశీలన, ఓట్ల లెక్కింపు తదితర ప్రక్రియలో అధికారులు, సిబ్బంది ముఖ్యపాత్ర పోషిస్తారు. వీరిలో కొన్ని విభాగాల వారికి శిక్షణ కూడా ప్రారంభమైంది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల అధికారులు సమాచారం అందించారు. ప్రిసైడింగ్ అధికారుల క్యాటగిరీ వరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు 1,96,312 మంది సిబ్బంది అవసరం కాగా.. అందుబాటులో 2,01,126 సిబ్బంది ఉన్నారని గుర్తించారు. ఎన్నికల నిర్వహణకు అత్యవసరంగా మరో రెండు శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా విధులకు హాజరుకాలేని పరిస్థితి ఉంటే పనులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎన్నికల విధి నిర్వహణ నుంచి అత్యవసర సేవలు అందించే శాఖల సిబ్బంది, అధికారులను మినహాయించారు. వైద్య ఆరోగ్య శాఖ, ఫైర్ డిపార్ట్‌మెంట్, విద్యుత్తు శాఖ తదితర అత్యవసర శాఖల సిబ్బందికి మినహాయింపునిచ్చారు.

**ఎన్నికల నిర్వహణ సిబ్బంది వివరాలు**

| పోలింగ్ సిబ్బంది | అవసరమైన సిబ్బంది | అందుబాటులో ఉన్న సిబ్బంది |
|---|---|---|
| సెక్టార్ అధికారులు | 3,803 | 3,845 |
| ఫ్లైయింగ్ స్క్వాడ్ | 1,251 | 1,263 |
| స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు | 1,316 | 1,331 |
| వీడియో సర్వైలెన్స్ బృందాలు | 640 | 640 |
| వీడియో వ్యూయింగ్ బృందాలు | 290 | 290 |
| వ్యయ సహాయ పరిశీలకులు | 184 | 187 |
| వ్యయ పరిశీలన బృందాలు | 234 | 234 |
| మైక్రో అబ్జర్వర్స్ | 8,788 | 9,185 |
| రూట్ ఆఫీసర్స్ | 4,039 | 4,164 |
| ప్రిసైడింగ్ ఆఫీసర్స్ | 43,171 | 44,158 |
| ఇతర ఎన్నికల సిబ్బంది | 1,32,596 | 1,35,829 |
| మొత్తం | 1,96,312 | 2,01,126 |

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### ఎయిమ్స్‌లో..

**నాగపూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 5
- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్
- సబ్జెక్టులు: బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్ తదితరాలు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 17
- వెబ్‌సైట్: https://aiimsnagpur.edu.in

### నాన్ టీచింగ్ స్టాఫ్

**కర్నూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 3
- పోస్టులు: జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ టెక్నీషియన్ (సీఎస్‌ఈ, మెకానికల్)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 25
- వెబ్‌సైట్: https://iiitk.ac.in

### ఫ్యాకల్టీలు


**ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్&అలైడ్ సైన్సెస్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 35
- పోస్టులు: ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- విభాగాలు: న్యూరో రేడియాలజీ, న్యూరాలజీ, క్లినికల్ సైకాలజీ, సైక్రియాట్రి తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 30
- వెబ్‌సైట్: www.ihbas.delhigovt.nic.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ ప్రత్యేకం హిస్టరీ, కరెంట్ అఫైర్స్, జీఎస్ కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.



మినీ అంగన్‌వాడీలను రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసినందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఎల్ రూప్‌సింగ్ తదితరులున్నారు.

# కిషన్‌రెడ్డీ అవాస్తవాల ప్రచారం మానుకో

- ట్రిబ్యునల్ ఏర్పాటు ఆలస్యంలో కేంద్రానిదే బాధ్యత
- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం రాష్ట్ర ఏర్పాటు నుంచి సీఎం కేసీఆర్ పోరాటం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పునఃపంపిణీకి ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడంలో జాప్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం ప్రస్తుత ట్రిబ్యునల్‌కే అదనపు టీవోఆర్‌ను నివేదించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ తాత్సారం వల్లనే కృష్ణా జలాల ట్రిబ్యునల్ ఏర్పాటులో ఆలస్యం జరిగిందని బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పేర్కొనడం సిగ్గుచేటని మండిపడ్డారు. వారిద్దరికీ కృష్ణా నదీ జలాల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నిరంతరాయంగా చేసిన పోరాట చరిత్ర తెలియదని విమర్శించారు.

#### తెలంగాణకు ఇది గొప్ప విజయం

తెలంగాణకు ఇది గొప్ప విజయమని, సీఎం కేసీఆర్ పట్టుబట్టి సాధించిన విజయమని బోయినపల్లి వినోద్‌కుమార్ వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నెల రోజులకే సీఎం కేసీఆర్ ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం ప్రధాని మోదీకి లేఖ రాశారని, గత తొమ్మిదేండ్లలో అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశారని తెలిపారు. కేంద్రం విధించిన షరతు ప్రకారం సుప్రీంకోర్టులో కేసు ఉపసంహరించుకున్న తరువాత కూడా రెండేండ్లుగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయకుండా తాత్సారం చేసింది బీజేపీ ప్రభుత్వమేనని వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతకాలం కేంద్రం స్పందించకపోవడానికి కారణం ఎవరని నిలదీశారు. సాగునీటి అవసరాలు పెరిగిన దృష్ట్యా కృష్ణా జలాల్లో తాత్కాలికంగా 50:50 వాటాను వినియోగించుకుంటామని 2018 నుంచే తెలంగాణ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. తెలంగాణకు న్యాయమైన వాటా లభించేదాకా పోరాటం కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.